నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. కర్మన్‌ఘాట్‌, సాయిరాంనగర్‌ 33/11 కేవీ విద్యుత్‌ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సాయిరాంనగర్‌, గ్రీన్‌ పార్క్‌, కర్మన్‌ఘాట్‌, శ్రీరాంనగర్‌, నిర్మలా నగర్‌, హనుమాన్‌నగర్‌ కాలనీలలో అదేవిధంగా సుల్తానాఅల్వా, పద్మానగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు కటకోనికుంట, చంపాపేట పాత బస్తీ, సుల్తానాఅల్వా, బస్తీదవాఖానా ప్రాంతం, రాజిరెడ్డినగర్‌, పద్మానగర్‌, కళ్యాణీ మోటర్స్‌, క్రాంతినగర్‌, శ్రీనిధి, నిర్మలానగర్‌, జ్యోతినగర్‌, కర్మన్‌ఘాట్‌, రాఘవేంద్ర కాలనీల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

సైదాబాద్‌లో...

సైదాబాద్‌: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌ రెడ్డి తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు.. జీఏ బ్యాంక్‌ కాలనీ, త్రివేణి నగర్‌, వీకే ధాగే నగర్‌ పరిసర ప్రాంతాలు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 వరకు.. సైదాబాద్‌ 2ఆర్‌టీ మెయిన్‌రోడ్‌, వెంగళ్‌రావ్‌ పీటీ, సైదాబాద్‌ రామాలయం, ఎస్‌బీహెచ్‌ ఆఫీసర్స్‌ కాలనీ, లక్ష్మీనగర్‌ సాయిబాబా టెంపుల్‌ పరిసర ప్రాంతాలు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 వరకు.. పద్మావతీ కాలేజ్‌, ఇంద్రప్రస్థ ఫేజ్‌-2, సుబ్రహ్మణ్యనగర్‌, కరణ్‌బాగ్‌ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగోజిగూడ: ప్రజలు కడుతున్న పన్నులతో కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని మన్సూరాబాద్‌కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆదిత్యనగర్‌లో రూ.22 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సంవత్సరం నుంచి టెండర్లు పూర్తయి పెండింగ్‌లో ఉన్న పనులు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయని తెలిపారు.నిధులు మంజూరు కాని అభివృద్ధి పనులకు జోనల్‌ కమిషనర్‌ చొరవతో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణ, రాజేందర్‌ ప్రసాద్‌, మురళీధర్‌రెడ్డి, భిక్షపతి, రామకృష్ణ, చంద్రశేఖర్‌, వెంకటేశ్‌, బలరాం, శంకర్‌ పాల్గొన్నారు.

వారాహి దేవి నవరాత్రులు ప్రారంభం

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవి మందిరంలో వారాహీ దేవి నవరాత్రులు గురురవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. గురువారం అమ్మవారికి విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు నిర్వహించి కుంకుమార్చన చేశారన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విఠల్‌ శర్మ, నిఖిల్‌ శర్మ, సువర్ణలత, అరుణ, జయశ్రీ, కనకవల్లి, రాధ, సరిత, మైథిలి పాల్గొన్నారు

30వ తేదీ వరకే రేషన్‌ బియ్యం

చాదర్‌ఘాట్‌: మూడు నెలల రేషన్‌ బియ్యం ఈ నెల 30వ తేదీ వరకే పంపిణీ చేస్తారని మలక్‌పేట సర్కిల్‌-1 ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 92 శాతం బియ్యం తీసుకున్నారని మొత్తం 69,752 రేషన్‌ కార్డులు ఉండగా 67 వేల కార్డుదారులు బియ్యం తీసుకున్నారన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



నాగోలు: నాగోలు డివిజన్‌ పరిధిలో నర్సింహస్వామి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్‌ పరిధిలోని నర్సింహస్వామి కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఫేస్‌-1 అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు గురువారం ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలు వివరించారు. కాలనీలో డ్రైనేజీలు పొంగుతున్నాయని తాగు నీటి వసతి కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చిరంజీవి, అశోక్‌ రెడ్డి, రామచంద్రమ్‌ యాదవ్‌, అనిల్‌ రెడ్డి, మధుసూదన్‌ రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌ పార్టీ నుంచి మదన్‌బాబు, గంట్ల కృష్ణ సస్పెన్షన్‌

మలక్‌పేట: మలక్‌పేట నియోజవర్గం సైదాబాద్‌ డివిజన్‌కు చెందిన ఏ.మదన్‌బాబు, గంట్ల కృష్ణను కాంగ్రెస్‌ పార్టీ అధిష్టానం సూచనల మేరకు వారిని పార్టీ బాధ్యతలు, కార్యకలాపాల నుంచి తప్పిస్తూ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌ వలియుల్లా సమీర్‌ గురువారం సస్పెన్షన్‌ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ క్రమశిక్షణ, విలువ, ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ సమావేశాల్లో దుర్వినియోగ పదాలను ఉపయోగించినందుకు టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ బాధ్యులు, పార్లమెంట్‌ పరిశీలకులతో జాగ్రత్తగా పరిశీలించి, సంప్రదించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

నాలా పేరుతో రూ. 53 లక్షలు నొక్కేశారా?

ఐఎస్‌సదన్‌లో మరో కుంభకోణం ● నాలా నిర్మించకుండానే బిల్లులకు యత్నం ● కార్పొరేటర్‌ శ్వేతామధుకర్‌రెడ్డి ఆరోపణలు

"ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధి సింగరేణి కాలనీలో సీసీ రహదారి వేయకుండానే కాంట్రాక్టర్‌, జీహెచ్‌ఎంసీ అధికారులు కుమ్మక్కై రూ. 9 లక్షల కాజేసిన సంగతి విదితమే. ఈ ఘటనపై కార్పొరేటర్‌ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి ఫిర్యాదుతో విజిలెన్స్‌ విచారణ నిర్వహించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ కర్ణన్‌ బాధ్యులైన అధికారులను సస్పెండ్‌ కూడా చేసారు. అయితే ఇప్పుడు అదే ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలో మరో అవినీతి కుంభకోణం జరిగిందంటూ కార్పొరేటర్‌ ఆరోపిస్తున్నారు. రూ. 90 లక్షల అభివృద్ధి పనికి సంబంధించి ఎలాంటి పనులు చేయకుండానే రూ. 53 లక్షలు స్వాహాకు యత్నిస్తున్నారని కార్పొరేటర్‌ ఆరోపించటం కలకలం రేపుతుంది. సింగరేణి కాలనీలో రహదారి అవినీతిపై పూర్తి ఆధారలతో చేసిన విధంగానే ఈ నాలా నిర్మాణ పనుల్లోనూ అవినీతి జరిగిందని తాను ఆరోపిస్తున్నానని కార్పొరేటర్‌ అంటున్నారు."

-సైదాబాద్‌



నాలా నిర్మాణం జరిగిందని చెపుతున్న డీఎస్‌నగర్‌లోని ప్రాంతం

నాలా పేరుతో..

వరద ముంపు సమస్య పరిష్కారం కోసం ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలోని దామోదర సంజీవయ్య నగర్‌ నల్లపోచమ్మ దేవాలయం నుంచి సెంట్రల్‌ ఎక్సైజ్‌ కాలనీ పార్కు వరకు బాక్స్‌ డ్రైన్‌ తరహా వరద నీటి కాలువ నాలా నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ టెండర్లు ఖరారు చేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించింది. ఈ అభివృద్ధి పనులను 2021 జూన్‌లో కార్పొరేటర్‌ చేతుల మీదుగానే ప్రారంభించారు. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ మొదట్లో అక్కడ కొంత మెటీరియల్‌ను డంప్‌ చేసి పనులు చేస్తున్నట్లు నమ్మించాడు. అయితే ఆ తరువాత కార్పొరేటర్‌ కానీ, స్థానికులు కానీ ఎప్పుడు అధికారులను ఈ విషయమై ప్రశ్నించినా తప్పించుకుంటున్నారు. అయితే అసలు ఎలాంటి అభివృద్ధి పనులు జరగని సదరు నాలా నిర్మాణ పనులలో కొంత భాగం పనులు చేసామని, తప్పుడు కొలతలు చేయించి కాంట్రాక్టర్‌ రూ. 53 లక్షలు దండుకోవటానికి యత్నిస్తున్నాడని కార్పొరేటర్‌ ఆరోపిస్తున్నారు.

'ఆర్టీఐతో వెలుగులోకి..

2020 నుంచి 2024 ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు తెలపాలని కార్పొరేటర్‌ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి గత మే 15న జీహెచ్‌ఎంసీ అధికారులను ఆర్‌టీఐ ద్వారా ప్రశ్నించారు. అందుకు సమాధానంగా అధికారులు డివిజన్‌లోని పలు ఇతర పనులతో పాటు డీఎస్‌నగర్‌లోని నాలా నిర్మాణం పనులు రీవాలిడేషన్‌ కోసం ఫైనాన్స్‌ అండ్‌ అకౌంట్స్‌ సెక్షన్‌కు పంపామని సమాధానం ఇచ్చారు. అయితే ఒకవైపు కాంట్రాక్టర్‌ కొంత పని చేసానని బిల్లులు పొందగా, అసలు అక్కడ పని జరగలేదని అధికారులు చెప్పడం గందరగోళంగా ఉందని కార్పొరేటర్‌ వ్యాఖ్యానించారు.



కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్‌

కమిషనర్‌కు ఫిర్యాదు..

డీఎస్‌నగర్‌లో నాలా నిర్మించల్సిన స్థలాన్ని కార్పొరేటర్‌ బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ స్థలాన్ని పరిశీలిస్తేనే ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పని చేయలేదు అని తెలుస్తుందని వారు అన్నారు. స్థానికులు సైతం ఇక్కడ కాంట్రాక్టర్‌ అసలు ఎలాంటి పని చేయలేదని వారికి తెలిపారు. అనంతరం కార్పొరేటర్‌, బీజేపీ నాయకులు, స్థానికులతో కలిసి అభివృద్ధి పనిలో చోటు చేసుకున్న అవినీతి గూరించి చట్టపరంగా విచారణ చేయాలని ఐఎస్‌సదన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఇదే విషయమై కార్పొరేటర్‌ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు, రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్‌ జనరల్‌కు సైతం విచారణ జరపాలని కోరతూ ఫిర్యాదు చేసారు.

కాంగ్రెస్‌తోనే ఎల్‌బీనగర్‌లో అభివృద్ధి



రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న మధుయాష్కీగౌడ్‌

వనస్థలిపురం: కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, గత పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో స్థానిక ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమీ లేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ ఆరోపించారు. వనస్థలిపురం డివిజన్‌ వనస్థలిహిల్స్‌కాలనీలో రూ.19.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఆయన రోడ్డు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్‌ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ఏడాదిన్నర కాలంలో ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలో రూ. 100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ హయాంలో ఇక్కడ కట్టిన పన్నులను సిరిసిల్ల తదితర ప్రాంతాలకు తరలించి అక్కడ అభివృద్ధి చేశారని, ఎల్‌బీనగర్‌, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్‌, జీహెచ్‌ఎంసీ ఈఈ కార్తీక్‌, ఏఈ విఘ్నేశ్వరి, జలమండలి డీజీఎం రాజగోపాల్‌, ఏఈ సాయిశ్రీనివాస్‌, ఇన్‌స్పెక్టర్‌ మహేష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

చిత్ర కళాకారులను గుర్తించాలి

నాగోలు: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న చిత్ర కళాకారులను కూడా ప్రభుత్వ పరంగా కళాకారులుగా గుర్తించాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్‌ సుందర్‌ గౌడ్‌ ఇతర నాయకులు గురువారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ అధికారి మామిడి హరికృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌ సుందర్‌గౌడ్‌ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రా సాధనలో చిత్ర కళాకారులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందే తెలంగాణ గోడ రాతల యాత్ర పేరుతో ఆంధ్రా తెలంగాణ 3 సరిహద్దుల దగ్గర తెలంగాణ రాష్ట్రం అన్ని రోడ్ల మీద రాస్తూ, గోడలపై తెలంగాణ రాష్ట్రం మన జన్మ హక్కు అని రాస్తూ తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేయడంలో చిత్ర కళాకారుల పాత్ర మరువలేదన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్‌, రాజేష్‌గౌడ్‌, అయిల్‌రెడ్డి, అమర్‌నాథ్‌, రవి, ధనుంజయగౌడ్‌ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ సుబ్బారామిరెడ్డి

మలక్‌పేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మలక్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మలక్‌పేట ఏసీపీ సుబ్బారామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ పిడమర్తి నరేష్‌ హాజరై విద్యార్థులతో కలిసి ప్లేకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు డ్రగ్స్‌ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌ ఐడియల్‌ కాలేజ్‌ నుంచి ప్రారంభమైన ర్యాలీ, కోణార్క్‌ టవర్స్‌, మూసారంబాగ్‌ చౌరస్తా మీదుగా మారుతిమందిర్‌ వరకు కొనసాగింది. ర్యాలీలో మలక్‌పేట డీఐ జయశంకర్‌, చాదర్‌ఘాట్‌ ఇన్‌స్పెక్టర్‌ బ్రహ్మమురారి, డీఐ భూపాల్‌, డబీర్‌పుర ఇన్‌స్పెక్టర్‌ నానునాయక్‌, ఎస్సైలు సంజీవ్‌రెడ్డి, స్వాతి, ఏఎస్సై రవికాంత్‌, పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం..

హయత్‌నగర్‌: మత్తు పదార్థాల వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుందని, డ్రగ్స్‌ వినియోగించినా, అమ్మినా, కటకటాల పాలవుతారని హయత్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగరాజుగౌడ్‌ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన హయత్‌నగర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని, ఎవరైనా అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు సహకరించాలన్నారు. అనంతరం డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

నాగోలు: ప్రైవేట్‌ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మన ఆలోచన సాధన సమితి(మాస్‌)రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు, ప్రచార కార్యదర్శి పెదవుర బ్రహ్మయ్య అన్నారు. గురువారం నాగోలు మాస్‌ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్‌, ప్రైవేట్‌ విద్యా సంస్థలు రోజురోజుకి విద్యను వ్యాపారంగా మారుస్తూ లక్షలో ఫీజులు వసూలు చేస్తున్నాని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో సరైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌ స్కూళ్లలో చేర్పిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో దేవేందర్‌, వెంకట్‌ యాదవ్‌, శంకర్‌, శ్రీనివాస్‌ గౌడ్‌, శ్రీనివాస్‌ చారి, నరసింహ గౌడ్‌ పాల్గొన్నారు

మహిళా జైల్లో 'నివృత్తి' డీ అడిక్షన్‌ సెంటర్‌



చంచల్‌గూడ: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చంచల్‌గూడ మహిళ జైల్లో గురువారం 'నివృత్తి' పేరుతో డీ అడిక్షన్‌ కేంద్రాన్ని జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా ప్రారంభించారు. మాదక ద్రవ్యాల నుంచి విముక్తి కలిగించడమే నివృత్తి ముఖ్య ఉద్దేశమన్నారు. మాదక ద్రవ్యాలతో జీవితాలు పాడు చేసుకున్న వారికి సన్మార్గంలో నడిచే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐజీ డా. శ్రీనివాస్‌, సూపరింటెండెంట్లు నవాబు శివకుమార్‌గౌడ్‌, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ



మాట్లాడుతున్న నిరంజన్‌ యాదవ్‌

సైదాబాద్‌: దేశ చరిత్రలో ఎమర్జెన్సీ విధింపు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా మిగిలిపోతుందని బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌ యాదవ్‌ అన్నారు. అప్పటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ ఎమెర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా ఆధ్వర్యంలో సైదాబాద్‌ డివిజన్‌ పరిధి ఎస్‌బీహెచ్‌ సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాయడం, పత్రికా స్వేచ్ఛకు భంగం కలగడం, ప్రతిపక్ష పార్టీల నాయకులపపై ప్రతీకార దాడులు, అరెస్టుల గురించి నేటి తరం యువతకు నాయకులు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సుభాష్‌చందర్జీ, కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, పార్టీ నాయకులు సహదేవ్‌ యాదవ్‌, లింగాల హరిగౌడ్‌, వీరేంద్రబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మలక్‌పేట: యూనికార్పస్‌ హెల్త్‌ ఫౌండేషన్‌, చేయూత, ఇండియా మెడికల్‌ మిషన్‌ సౌజన్యంతో గురువారం దిల్‌సుఖ్‌నగర్‌ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చర్చి సీనియర్‌ పాస్టర్‌ రెవరెండ్‌ బోడా సాల్మన్‌ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో పాల్గొన్న 289 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, 94 మంది కంటి అద్దాలు అందజేరన్నారు. పాస్టర్‌ శాంత్‌కుమార్‌, చర్చి కమిటీ అధ్యక్షుడు వేమూరి లూకానందరావు, చర్చి మెంబర్స్‌ పాల్గొన్నారు.

అమ్మపై నిర్లక్ష్యం.. కుమారులకు గుణపాఠం

ఇంటి నుంచి తల్లిని గెంటేసిన కుమారులు

- రెవెన్యూ అధికారులను ఆశ్రయించిన 90 ఏళ్ల వృద్ధురాలు
- ఇల్లు సీజ్‌ చేసి తల్లికి అప్పగించిన తహసీల్దార్‌



శకుంతలా బాయి



ఇంటిని సీజ్‌ చేయిస్తున్న తహసీల్దార్‌

సైదాబాద్‌: మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్న తీరు మానవత్వానికే మచ్చలా నిలుస్తోంది. చివరికి తమను కని, పెంచి, ప్రయోజకులను చేసిన కన్నవారి పట్ల కూడా అమానుషంగా వ్యవహరిస్తున్న వైనం మనసులను కకావికలం చేస్తుంది. అయితే వృద్ధాప్యంలోనూ తనను పట్టించుకోకుండా ఇంటి నుంచి గెంటేసిన కొడుకులకు ఓ తల్లి తగిన బుద్ధి చెప్పింది. జిల్లా రెవెన్యూ అధికారుల సహాయంతో ఎట్టకేలకు తన సొంతింటిని తాను సొంతం చేసుకుంది. మూసారాంబాగ్‌ డివిజన్‌ ప్రశాంత్‌నగర్‌కు చెందిన శకుంతులా బాయి (90)కి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. భర్త చాలా ఏళ్ల క్రితమే మరణించారు. అప్పటి నుంచి తన నివాసంలో కొడుకులతో కలిసి ఉండేది. కొంత కాలం తర్వాత తల్లి ఆలనా పాలన చూడాల్సిన కుమారులు నిర్లక్ష్యం చేయడం మొదలు పెట్టారు. అంతే కాకుండా తల్లిని బలవంతంగా ఇంటి నుంచి బయటకు పంపేశారు. దాంతో గత్యంతరం లేక వృద్ధురాలు ఏడాదిన్నరగా సైదాబాద్‌లోని చిన్న కూతురు ఇంటి వద్ద ఉంటుంది. తన బాగోగులు చూడని కొడుకులు తన ఇంట్లో ఉండ కూడదని నిర్ణయించుకుంది. సీనియర్‌ సిటిజెన్స్‌ అసోషియేషన్‌ ప్రతినిధులతో కలిసి వెళ్లి హైదరాబాద్‌ జిల్లా ఆర్‌డీఓను 2024 ఫిబ్రవరిలో తనకు న్యాయం చేయాలని ఆశ్రయించింది. ఆర్‌డీఓ ఆమె ఇద్దరు కుమారులను పిలిచి కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఇంటిని తల్లికి ఇవ్వడానికి మొదట ఇద్దరూ అంగీకరించారు. అయితే నెలలు గడుస్తున్నా వారు ఇంటిని ఖాళీ చేయడం లేదు. ఆర్‌డీఓ ఆదేశాల మేరకు సైదాబాద్‌ తహసీల్దార్‌ జయశ్రీ వారికి పలుమార్లు నోటీసులు ఇచ్చినా వారు స్పందించ లేదు. దాంతో తహసీల్దార్‌ మూడు రోజుల క్రితం ఇల్లు ఖాళీ చేయాలని లేకుంటే సీజ్‌ చేస్తామని హెచ్చరిస్తూ ఫైనల్‌ నోటీసులు ఇచ్చారు. దాంతో వారు ఇంటికి తాళం వేసి సమాచారం ఇవ్వకుండా ఎటో వెళ్లిపోయారు. గురువారం సైదాబాద్‌ తహసీల్దార్‌ సిబ్బందితో వచ్చి ఇంటిని సీజ్‌ చేసారు. శకుంతలా బాయికి ఇల్లు అప్పగిస్తామని తహసీల్దార్‌ తెలిపారు.

యాదవులకు సముచితస్థానం కల్పించాలి



మాట్లాడుతున్న అరవీంద్రనాథ్‌ యాదవ్‌

నాగోలు: యాదవులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దేశ వ్యాప్త బీసీ కులగణనను నిర్వహించాలని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్‌ యాదవ్‌ డిమాండ్‌ చేశారు. గురువారం నాగోలు శుభం కన్వెన్షన్‌ సెంటర్‌లో నిర్వహించిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక, రాజకీయంగా ఎదగాలని పేద యాదవులను ఆదుకోవాలని అందుకు అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో యాదవులకు ఒక మంత్రి పదవితో పాటు, 3 ఎమ్మెల్సీలు, జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికల్లో యాదవులకు సీటు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవిస్తామన్నారు. ఈ సమావేశంలో లక్ష్మణ్‌ యాదవ్‌, హరిబాబు, శ్రీనివాస్‌ యాదవ్‌, రాజేందర్‌ యాదవ్‌, బాల మల్లేష్‌, కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి యాదవ్‌ పాల్గొన్నారు.